



## నగరి సిగలో మరో ఎకో పార్క్

శంషాబాద్ కోత్వాల్‌గూడలో రూ.75 కోట్ల వ్యయంతో 85 ఎకరాల్లో రూపుదిద్దుకున్న ఎకో పార్కును శుక్రవారం రాత్రి సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దీంతో సందర్శకులకు పార్క్ అందుబాటులోకి వచ్చింది. హిమాయత్ సాగర్‌కు ఆనుకుని దీనిని నిర్మించడంతో లేక్ వ్యూ ఫ్రంట్ పార్కుగా కనువిందు చేయనుంది. మరోవైపు విశాలమైన పచ్చికబయళ్లు, ఉద్యానవనాలు, వివిధ రకాల పక్షులతో ఎకో పార్కు ఆకట్టుకోనుంది. ఈ కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# పగలంతా రెక్కీ



**రాత్రయితే చోరీ**

**ఏటా వేసవిలో బెంబేలెత్తిస్తున్న దొంగలు**

**తాళం వేసి ఉన్న నివాసాలే టార్గెట్**

**గృహ యజమానుల ఉదాసీనతే కారణం**

**బ్యాంకు లాకర్లకు దూరం**

**గస్తీ, నిఘాపై పోలీసులు మరింత దృష్టి**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి** : పగలంతా రెక్కీ.. రాత్రయితే చోరీ షరామామూలవుతుంది. ముఖ్యంగా తాళం వేసి ఉన్న నివాసాలే దుండగుల లక్ష్యాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రీ అనే తేడా లేకుండా పెట్రోలింగ్ కొనసాగుతోందని పోలీస్ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, కొంతమంది చేసే చిన్నచిన్న తప్పిదాలే దొంగలకు అవకాశాలుగా మారుతున్నాయన్నది నమ్మలేని నిజం.

**ప్రతి వేసవిలో ఇంతే..**

వేసవి వచ్చిందంటే వికారాబాద్‌లో పట్టణ వాసులకు దొంగల భయం పట్టు కుంటుంది. ఇంటికి తాళం పడితే చాలు గొళ్లెం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకొని వెళ్లిపోతారు. జిల్లాలో ప్రతియేటా వేసవి సెలవుల్లో దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. నిరుడు పెద్దగా చోరీల సంఘటనలు వెలుగు చూడలేదు. కానీ గతంలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. ఈ నెలలో టెన్త్ పరీక్షలు ప్రారంభమై వచ్చేనెలలో ముగియనున్నాయి. ఇవే కాకుండా ప్రైమరీ స్కూళ్లు కూడా ఏప్రిల్‌లో మూతపడతాయి. వేసవి సెలవుల్లో చాలామంది ఇంటికి తాళం వేసి వెళ్లిపోతుంటారు. వివాహ వేడుకల్లో కూడా పాల్గొంటుంటారు. తిరిగి ఇంటికి రాగానే పలుచోట్ల దొంగతనాలు జరిగిపోతుంటాయి. ఇంటి యజమానులు కొన్ని సూచనలు పాటిస్తే సురక్షితంగా బయటపడవచ్చని అంటున్నారు. వేసవి సెలవుల్లో ఇంటికి తాళం వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి.

**బ్యాకులలో లాకర్ల కొరత**

బ్యాంకు లాకర్లలో తమ విలువైన ఆభరణాలు, డబ్బు, డాక్యుమెంట్లు దాచి పెట్టాలని సూచిస్తున్నారు. ఇప్పటికీ చాలామందికి బ్యాంకు లాకర్ల గురించి అవగాహన లేదని తెలుస్తోంది. అయితే, పలు జాతీయ బ్యాంకులలో లాకర్లు సరిపోవడం లేదని కూడా సమాచారం. దూర ప్రాంతాలకు వెళితే ఇంటి చుట్టు పక్కల వారికి సమాచారం ఇవ్వడం మంచిదని అంటున్నారు. ఎలాంటి అలికిడి వచ్చినా చుట్టు పక్కల వారు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు వీలవుతుంది.

**మండల కేంద్రాల్లోనూ దొంగల బెడద**

సొంత ఇంటి యజమానులు నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఇంకా మంచిదని పోలీసులు అంటున్నారు. తమ మొబైల్ ద్వారా ఇంటి వద్ద ఏమి జరిగినా ఇట్టే తెలిసిపోతుంది. జనావాసాలకు దూరంగా ఉన్న ఇళ్లనే దొంగలు ఎక్కువగా టార్గెట్ చేసే అవకాశాలు ఉంటాయి. పట్టపగలు అపరిచితులు సంచరించి ఎవరూలేని ఇళ్లను రాత్రిపూట దోచుకునేందుకు సిద్ధమవుతారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలుమార్లు వెలుగు చూశాయి. తాండూరు, పరిగి, వికారాబాద్ పట్టణాలే కాకుండా పలు మండల కేంద్రాల్లో కూడా వేసవి దొంగతనాలు చోటు చేసుకున్నాయి. ఇక పోలీసు పెట్రో లింగ్ కూడా మెరుగు పరచాల్సి న అవసరం ఉన్నది. జనాభాకు సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడం, సభలు, సమావేశాలు, వీఐపీల భద్రత, బందోబస్తు, కోర్టు డ్యూటీ తదితర బాధ్యతలు ఉన్నాయి. దానివల్ల పూర్తిస్థాయి పెట్రోలింగ్ నిర్వహించడం సాధ్యం కావడం లేదు. కొన్నిచోట్ల పోలీసుల వైఫల్యాలు కూడా ఉన్నాయి. రాత్రిపూట పహారా చేయకపోవడం, వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టకపోవడం, కార్డన్ అండ్ సెర్చ్‌కు దూరం కావడం వంటి అంశాలపై పోలీసులు సంపూర్ణంగా దృష్టి సారిం చాల్సి ఉన్నది. అంతేకాకుండా గతంలో మఫ్టీలో పోలీసులు కాలనీలను, గ్రామాలను తిరిగి అపరిచితుల గురించి ఆరా తీసేవారు. ఇటీవల కాలంలో గస్తీ తగ్గడమే కాకుండా నిఘా కూడా కరువైందని విమర్శలు వస్తున్నాయి.

**జాతీయ రహదారులపై మరింత నిఘా అవసరం**

జాతీయ రహదారులపై పోలీసు నిఘా పెంచాల్సి న అవసరం ఉన్నది. జిల్లాలో హైదరాబాద్ నుంచి బీజాపూర్ జాతీయ రహదారి పొడవు సుమారు 70 కిలోమీటర్లు ఉండగా చించోలి-మహబూబ్‌నగర్ జాతీయ రహదారి కూడా 50 కిలోమీటర్ల మేరకు ఉన్నది. ఈ రహదారిపైనే ప్రధాన పట్టణాలు ఉన్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులు కూడా సమీపంలోనే ఉండటం వల్ల అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు సంచరించే ప్రమాదం ఉన్నది. గతంలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు తాండూరు, పరిగి పట్టణాల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డాయి. ఇంకా పలు కేసుల మిస్టరీ ఛేధించలేదని సమాచారం. వికారాబాద్ జిల్లా మీదుగా అనేక రైళ్లు దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ నేరాలకు పాల్పడే ముఠా సకాలంలో రైలు ఎక్కితే కేవలం 20 నిముషాలలో పొరుగు రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు వీలవుతుంది. రైల్వేస్టేషన్లపై కూడా నిఘా పెంచాలి.

**వేసవి సరదాలనే కాదు.. దొంగల బెడదనూ తెచ్చిపెడుతుంది. సంవత్సరంలో జరిగే చోరీ కేసులో సుమారు సగం ఆ ఒక్క సీజన్‌లోనే చోటుచేసుకుంటున్నాయి. సెలవుల్లో సొంతూరు ప్రయాణాలు, శుభకార్యాల సందళ్లు, ఆరుబయట నిద్రలు చోరుల చేతివాటానికి కారణంగా నిలుస్తున్నాయి. కనీస జాగ్రత్తలతోనే ఇల్లు గుల్ల కాకుండా కాపాడుకోగలం.**

### స్వీయ జాగ్రత్తలే శ్రీరామరక్ష

ఎవరైనా కొద్దిరోజులు ఊరెళ్లాల్సి వస్తే సమీప బంధువు, లేదా కుటుంబంలో ఎవరో ఒక సభ్యుడిని ఇంట్లో ఉంచడం మేలని పోలీసు అధికారులు సూచించారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే విలువైన ఆభరణాలు, ఎక్కువ మొత్తంలో నగదును ఇంట్లో ఉంచ వద్దన్నారు. తలుపులకు మామూలైనవి కాకుండా పూర్తి భద్రతతో కూడిన తాళాలు వినియోగించాలని వివరించారు. ఊరు వెళ్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిరునామా, వివరాలు తెలిపితే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. బీరువాలో సొత్తు ఉంచి తాళాలను పోపు డబ్బా లు, దిండ్లు, సామగ్రి కింద, ఆరు బయట ఎక్కడో ఒకచోట దాచిపెట్టే పద్ధతులు మార్చుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే చుట్టుపక్కల వారు వెంటనే 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రధాన కాలనీల్లో స్థానికులంతా కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం మంచిదని హితువు పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

# ఎక్కడా నిర్లక్ష్యం వద్దు

**హామీల అమలు కోసం జవాబుదారీగా ఉన్నాం**

**సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించండి**

**అమలుకాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక**

**అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి6, ప్రభాత వార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నకోరారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు సి. నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి తదితరులు హాజరయ్యారు. మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పది అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజల వద్దకే వెళ్తారని తెలిపారు. రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దలూరులో వైన్ తయారీ ప్రాజెక్ట్

**హోటళ్లు, రిసార్టులతో ఆతిథ్య రంగం అభివృద్ధి**

**భారీగా ఉపాధి అవకాశాలు**

**'ఐర్యా' డెవలపర్స్, హోటల్ రిసార్ట్స్ సంస్థల వెల్లడి**

**వికారాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా సిద్దలూరు గ్రామంలో ఐర్యా డెలపర్స్ ఎల్ఎల్‌పి, ఐర్యా హోటల్స్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పి సంస్థలు ఉమ్మడిగా సమీకృత వైన్ ఉత్పత్తి, ఆతిథ్యరంగ ప్రాజెక్టును అభివృద్ధిచేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో వైన్ తయారీ, వైన్‌యార్డ్ ఆధారిత పర్యాటకరంగం అభివృద్ధి, ప్రీమియం స్థాయి ఆతిథ్యరంగం రూపకల్పనచేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. తమ ప్రాజెక్టులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో గుర్తింపు ఇచ్చిందని, తెలంగాణ కాంక్లేవ్ 2025 సందర్భంగా యువత అభివృద్ధి, పర్యాటకరంగం, సంస్కృతి విభాగం ఈ ప్రాజెక్టుకు లెటర్ ఆఫ్ అవార్డు కూడా జారీచేసిందని ఐర్యా డెవలపర్స్ ఎల్ఎల్‌పి వెల్లడించింది. తమ ప్రాజెక్టుల్లో ప్రీమియం టూరిజం మౌలికవనరులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈప్రాజెక్టులవల్ల వందలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఆతిథ్యరంగం, రిసార్టు నిర్వహణ, హోటల్ యాజమాన్యం, ఆహారం, శీతలానీయాల సేవలు, హౌస్‌కీపింగ్, ఆతిథ్యసేవలపరంగా ఉపాధిపెరుగుతుందని అన్నారు. స్థానికంగా ఉన్న సరఫరాచైన్ సంస్థలనుంచే వ్యవసాయ ఉత్పత్తులు, నిర్మాణరంగ సామగ్రి, వినియోగ రంగ ఉత్పత్తులు, వృత్తిపరమైన సేవలను కూడా స్వీకరిస్తున్నట్లు ఐర్యా సంస్థలు తెలిపాయి. వార్త దినపత్రికలో ప్రచురించిన కథనంపై 'ఐర్యా' సంస్థలు స్పందించి పూర్తిస్థాయిలో తమ ప్రాజెక్టు వివరాలను తెలిపాయి. అలాగే రవాణారంగంలో సేవలు పెరుగుతాయని, స్థానికంగా గైడ్‌లకు ఉపాధి లభిస్తుందని, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హస్తకళలు, రిటైల్ ఇతర అనుబంధ రంగాలు కూడా విస్తృతస్థాయిలో అభివృద్ధిచెందుతాయని ఆయన అన్నారు. తమ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వ పూర్తి అనుమతులతోనే చేపట్టినట్లు 'ఐర్యా' సంస్థలు వివరణ ఇచ్చాయి.

## మాయదారి మత్తును చిత్తు చేయాలని...

**మాదక ద్రవ్యాల నిరోధంపై ఈగల్ టీం ఫోకస్ -కొడంగల్‌లో 2కే రన్ - ప్రజల భాగస్వామ్యం ఉంటేనే డ్రగ్స్ మహమ్మారికి చెక్ - యువత భవితను కాపాడటమే మా లక్ష్యం - ఎస్‌పి స్నేహా మెహ్రా పిలుపు**

**కొడంగల్, మార్చి 6, ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల మహమ్మారి నుండి పిల్లలను కాపాడుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణా కోసం శుక్రవారం ఉదయం కొడంగల్‌లో నిర్వహించిన 2కే రన్‌లో ఆమె పాల్గొన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత- డ్రగ్స్‌కు అడ్డుకట్ట అంశంపై కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ స్థాయిలో 2కే రన్ నిర్వహించారు. తెలంగానా రాష్ట్ర ఈగల్ టీం డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రారంబించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తు సే నో డ్రగ్స్=డ్రగ్ ఫ్రీ తెలంగాణా అనే నినాదాలతో యువత ముందుకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సి న నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత తమ శక్తిని క్రీడలు, విద్య, ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్ళించుకోవాలని అమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, యువత భవిష్యత్తును కాపాడటమే పోలీసు శాఖ, ఈగల్ టీంల ప్రధాన లక్ష్యమని అమె స్పష్టం చేశారు. మహిళలు విద్య, ఉద్యోగం, క్రీడలు, ఇతర రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అకాంక్షించారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం కొడంగల్‌కే పరిమితం కాకుండా వికారాబాద్ జిల్లాలోని 20 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 76 గ్రామాలలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన ర్యాలీలు, సమావేశాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు యువతలో డ్రగ్సపై చైతన్యం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణమూర్తి, జిల్లా అదనపు ఎస్పీ బి.రాములునాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎసైన జీవీ.సత్యనారాయణ, ఎంఆర్‌ఓ రాంబాబు, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో జరిగిన 2కే రన్‌లో పాల్గొన్న అనంతరం మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి స్నేహా మెహ్రా

## మహిళల ఆరోగ్యానికి విస్తృతంగా వైద్య శిబిరాలు

**అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం**

**రంగారెడ్డి అర్బన్, మార్చి 6, ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యపై ప్రభుత్వం అధిక ప్రధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీధర బాబు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య శిబిరాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం కుటుంబం, సమాజ అభివృద్ధికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టి, డెంటల్ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలను అందించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లలితాదేవి శిబిరాన్ని పర్యవేక్షించారు. కలెక్టరేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. మహిళల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు మమోగ్రామ్, అల్ట్రాసౌండ్, పాప్ స్మియర్ వంటి ప్రత్యేక పరీక్షలను కూడా నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్ విభాగంలో 216 మంది, ఈఎన్‌టి విభాగంలో 112 మంది, గైనకాలజీ విభాగంలో 123 మంది, ఆప్తమాలజీ విభాగంలో 124 మంది, డెంటల్ విభాగంలో 113 మంది, ఆర్థోపెడిక్ విభాగంలో 103 మంది, డెర్మటాలజీ విభాగంలో 111 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల రీసైక్లింగ్ : కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** వికారాబాద్ పట్టణ పరిధిలోని గంగారంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యర్థాల నిర్వహణ విధానం, శుభ్రత, వ్యర్థాల వర్గీకరణ పారిశుద్ధ్య చర్యలపై అధికారులతో మాట్లాడారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తను సక్రమంగా వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, దుర్వాసన, కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పట్టణం లో 28 వ వార్డ్ ను సందర్శించి వార్డ్ సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెహికిల్ తిరిగి 100 తడి, పొడి చెత్త సేకరణ జరగాలని, వెహికిల్ లో జియో ట్యాగింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహ రెడ్డి, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

### చీపురు పట్టి..శ్రమదాన స్ఫూర్తిని పంచి..



ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ పంచాయతీ పాలకవర్గం ఆదర్శంగా వ్యవహరించింది. సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో వార్డు సభ్యులు అందరూ కలిసి చీపురు పట్టి పంచాయతీ పరిసరాలను వారే స్వయంగా శుభ్రం చేశారు. ఎవరో వచ్చే వరకూ ఆగకుండా శ్రమదానం ద్వారా కూడా స్థానిక సమస్యలను తాత్కాలికంగా పరిష్కరించుకోవచ్చని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ నర్సింలు,ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి,

- ప్రభాతవార్త, నందిగామ

## రైతులకు బకాయిలు విడుదల

**కేశంపేట మార్చి 6 ప్రభాతవార్త :** మార్క్ ఫెడ్, సింగిల్ విండో ద్వారా రైతులు విక్రయించిన మొక్కజొన్న డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు వర్షాకాలంలో పండించిన మొక్కజొన్నలను వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా గత మూడు నెలల క్రితం విక్రయించారు. అందులో రెండు నెలల క్రితం కొందరికి డబ్బులు పడగా 561 మంది రైతులకు రాలేదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే విర్ల పల్లి శంకర్ దృష్టికి తతీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం 171 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి విడుదల చేసినట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతులకు మొక్కజొన్న పైసలు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎదురె నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు విస కరుణాకర్ రెడ్డి, నాయకులు రావుల పెంటయ్య, పర్వతాలు, నర్సింలు, హరీశ్వర్ రెడ్డి, మనోహర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సాంకేతిక పద్ధతులు అనుసరించాలి...

**మొయినాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రైతులు పంట సాగులో ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏ డి ఏ సురేష్ బాబు అన్నారు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు సాంకేతిక పద్ధతుల్లో అనుసరించవలసిన విధానాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఎరువులను వినియోగించుకునే విధానాల విషయంలో రైతులకు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడిఏ సురేష్ బాబు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసేటప్పుడు సాంకేతిక పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని ఆయన రైతులకు సూచించారు నర్సరీ ఏర్పాట్లు విధానాలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మామిడి పంటలో తాజా సాంకేతిక పద్ధతులు పంట నిర్వహణ విధానాలు ఎరువుల వినియోగ విధానం కూరగాయ పంటలో మల్చింగ్ ప్రాముఖ్యతపై ఆయన రైతులకు వివరించారు అలాగే వివిధ వ్యవసాయ పద్ధతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సహజ వ్యవసాయ అమలు విధానాలు నేల పరీక్షల ప్రాముఖ్యత పిఎం కిసాన్ పథకం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కొత్త వరి రకాలు ఎరువుల బుకింగ్ యాప్ వంటి అంశాలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు ప్రతి రైతు ఆధునిక వ్యవసాయ సాంకేతిక తను ఉపయోగించి పంటలను పండించినప్పుడే అధిక దిగుబడులు పెంచుకోగలుగుతారని రైతులకు సూచించారు మెట్ట సాగు ఉద్యాన శాస్త్రవేత్త గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే ఉద్యానవనాలపై దృష్టి సాధించినప్పుడే రైతులు అధిక లాభాలు పొందుతారని అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కీర్తి ఏ ఈ ఓ సునీల్ ఏ కుమార్ మండలంలోని సర్పంచులు రైతులు పాల్గొన్నారు

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**కొడంగల్, మార్చి 6ప్రభాతవార్త:** రాజకీయాలకతీతంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్తి పరిష్కారం చూపడం చారిత్రాత్మకమని మున్సిపల్ ఛైర్మేన్ నందారం ప్రశాంత్ కొనియాడారు.కాగ శుక్రవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పలు సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్బంగా ఛైర్మేన్ మాట్లాడుతూ దళితులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృసి చేస్తుందని పేర్కొన్నారు.అనంతరం హైద్రాబాద్‌లో జరిగే మాదిగ కృతజ్ఞత సభకు తరలివెళ్ళారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణంరాజు, రాము, ఉద్యోగులు కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**దుద్యాల్, మార్చి 06,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని 2వ వార్డులో ఎన్ఆర్ఈజీఎస్ (విబి జి రాంజీ) లో మంజూరైన 15 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులను కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య లు ప్రారంభించారు. గ్రామంలో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్ కుమార్, నాయకులు తుడుం రమేష్, శ్రీశైలం, ఖాజ, కృష్ణ, అనిల్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్, నరేందర్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం అందక మూగజీవాల మృత్యువాత..

**దుద్యాల్, మార్చి 6,ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రంలో వెటర్నరీ వైద్యశాల ఉన్నప్పటికీ డాక్టర్ లేకపోవడంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయించిన సరైన సమయంలో వైద్యం అందక, గోపాలమిత్రలు అందుబాటులో లేకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. మండల కేంద్రంలోని చిల్ముల బాలరాజ్ కు చెందిన పాడి ఆవు, పోల్కంపల్లి రాములు కి చెందిన పాడి ఆవు సరైన వైద్యం అందక మృత్యువాత పడ్డాయి. ఒక్కో ఆవు సుమారు 80వేల విలువ కలదని, పాలు అమ్ముకుని జీవనం సాగిస్తామని పశువుల మృతితో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని వెటర్నరీ వైద్యశాలలో డాక్టర్ ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సినీ అవకాశాల పేరుతో అసభ్య చేష్టలు

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:**

సినీ అవకాశాల కోసం వచ్చిన ఒక యువతిని అవకాశం పేరుతో అసభ్యకర దృశ్యాలను చిత్రీకరించి సామాజిక మాధ్య మాల్లో పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్న ఒక వెబ్ సిరీస్ దర్శకుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీ హిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణనగర్‌లో నివసించే శంకర్(25) రీల్స్‌తోపాటు వెబ్‌సిరీస్‌లకు దర్శకత్వం వహిస్తా డు. సినీ అవకాశాల కోసం కాకినాడ నుంచి వచ్చిన ఒక యువతి(23)కి వెబ్‌సిరీస్‌లో అవకాశం కల్పించాడు. కారులో కొన్ని అభ్యంతరకమైన దృశ్యాలను చిత్రీకరించి వాటిని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఇది గమనించిన యువతి తల్లిదం డ్రులు ఆమెపై కోపగించుకోవడంతో ఆయా వీడియోలను తొలగించాలంటూ యువతి శంకర్‌ను కోరింది. వీడియోలు తీయకపోగా ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించగా పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలకు ఘన సన్మానం

**పేట్ బషీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త**

286 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో మహిళా దినో త్సవాన్ని పురస్కరిం చుకొని శుక్రవారం మస్కూరి పద్మ, విజ యదేవి, కవిత, కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళలకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను శాలు వాలతో సత్కరించి అడ్వాన్స్‌గా మహిళా దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని వారు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కుంట పద్మ సిద్ధిరా ములు, సమ్మయ్య, నేత చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డ్రగ్స్ నివారణకు కృషి చేయండి: డిజిపి

**మోమిన్‌పేట్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీస్ మార్గదర్శకత్వంలో, ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో మరియు శ్రీమతి స్నేహ మెహ్రా ఐపీఎస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికారాబాద్ జిల్లా గారి ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మోమిన్‌పేట్ మండలంలో డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పిల్లల భద్రత (డ్రగ్స్ కు అడ్డుకట్ట అనే అంశంపై) నిర్వహించబడినవి. మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి, ఎన్కతల, మొరంగపల్లి గ్రామాల పాఠశాల ప్రాంగణాలలో విద్యార్థులు మరియు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మోమిన్‌పేట్ లోని రైతు వేదిక వద్ద కూడా ప్రజలతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, విద్యార్థులు, మత్తు పదార్థాల భారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు మరియు సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో మత్తు పదార్థాల (నార్కోటిక్స్) కు సంబంధించిన ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లైతే వెంటనే ఆంటీ నార్కోటిక్స్ టోల్‌ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం ఇవ్వాలని లేదా 8712671111 వాట్సాప్ నెంబర్ కు వివరాలు పంపాలని సూచించారు. సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని, వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారాం ఎస్పీ నార్కోటిక్స్ ఈగల్ ఫోర్స్, ఉపేందర్ డీఎస్పీ ఈగల్ ఫోర్స్, జి.వెంకట్ సీఐ మోమిన్‌పేట్ సర్కిల్, అలాగే స్థానిక మండల ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎంపీడీఓ, ఎంఆర్ఓ మోమిన్‌పేట్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజా సంఘాల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



పాల్గొన్న ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

## ప్రగతి ప్రణాళికలో అధికారులు నిమగ్నం

**ఆమనగల్లు, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణకు అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో చైర్మన్ నేనవత్ పత్యనాయక్ ముఖ్య అతిథిగా కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం 99 రోజుల ప్రగతి ప్రణాళికను వివరించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడీఓ మాధురి కుసుమ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై పలు ప్రభుత్వ శాఖల మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేసిన అధికారులు అనంతరం కార్యాలయం పరిసరాలను శుభ్రం చేసేందుకు శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు, ఎంపిఓ లక్ష్మణ్, ఏపిఓ మాధవరెడ్డి, ఏపిఎం నీరజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, డిప్యూటీ తహశీల్దార్ వినోద్, మెడికల్ ఆఫీసర్ మైమూన, దేవోజీ, జయమ్మ, రవీందర్, కుమార్, సుమలత, ప్రసన్న, రమేష్, శ్రీకాంత్, హఫీజా, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.



శ్రమదానం చేస్తున్న ఎంపిడిఓ

## 99 రోజుల ప్రగతి ప్రణాళికపై సమీక్ష

**యాచారం, మార్చి 6, ప్రభాతవార్త :** యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధారాణి అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రాణాళిక పై సమీక్ష సమావేశంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాసిల్దార్ అయ్యప్ప, సీఐ నందీశ్వర్ రెడ్డి, వ్యవసాయ అధికారి రవినాథ్ నాతో కలిసి సర్పంచులు వివిధ శాఖల అధికారులు ప్రజాపాలన ప్రగతి ప్రాణాళిక అంశాలపై సమీక్ష సన్నాహాక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మూడోసారి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతుందని పేర్కొన్నారు. పదివారాలపాటు వారానికో ప్రత్యేక విభాగం శాఖ కార్యక్రమాలపై వారోత్స వాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అందులో భాగంగా గ్రామాలలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఇందిరా మహిళా శక్తి ద్వారా కొత్తగా వ్యాపార అభివృద్ధికి అవకాశాలు గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరవింద్ నాయక్, బుచ్చిరెడ్డి, సంగం చైతన్య రాజు, వివిధ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ సుధీర్, వివిధ గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాస్టింగ్ ఆరోపణలు అవాస్తవం

**-రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధుల వివరణ**

**రంగారెడ్డి అర్బన్ మార్చి 6, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండలంలోని మానసహల్స్ క్రషర్ క్వారీలలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలు అవాస్తమని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెని ప్రతినిధులు తెలిపారు. బిఆర్ఎస్ నేతలు కోత్వాల్‌గూడలోని పలు క్రషర్ క్వారీలను సందిర్శంచి పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి చెందిన రాఘవ కనుస్ట్రక్షన్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం పలువురు కంపెనీ ప్రతినిధిలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాజేంద్రనగర్ మండలంలోని మానస హిల్స్ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పొంగులేటి ప్రసాద్ రెడ్డికి చెందిన రాఘన కన్‌స్ట్రక్షన్ కంపెనీ క్రషర్ క్వారీలు నిర్వహిస్తుందని మాజీ మంత్రి హరీష్, ఇతర బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇందులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఇది కేవలం వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతిసేందుకు బిఆర్ఎస్ చేస్తున్న కుంట్రని మండిపడ్డారు. 2022-23లో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే బుద్వేల్‌లో 100 ఎకరాల భూమిని హెచ్‌ఎండిఎ వారు వేలం వేశారు. ఈ 100 ఎకరాలు భూమిలో లౌఔట్ డెవల్‌మెంట్ పనుల కాంట్రాక్టును హెచ్ఎండి వారు, ఎన్‌సిసి లిమిటెడ్ కంపెనీకి అవార్డు చేయడం జరిగిందని లేఅవుట్ చేస్తున్నప్పుడు వెలువడిన రాళ్లను కోత్వాల్ గూడలో ఆ కంపెనీ డంప్ చేయడం జరిగిందని అదే డంప్ మెటిరయన్ ఇప్పుడు క్రషింగ్ చేస్తుంటే కొత్తగా క్వారీలు తవ్వుతున్నారని ఆరోపించడం సరైంది కాదని పేర్కొన్నారు.ఈ డంప్ చేసిన రాళ్లను ఎన్‌సిసి లిమిటెడ్ వారు , డికెఆర్ అనే కంపెనీ ద్వారా క్రషింగ్ చేసి హెచ్‌ఎండిఎ బుద్వేల్ ప్రాజెక్టులో రోడ్డు పనులకు వినియోగిస్తుందన్నారు.అదే విధానంలో అదే డంప్ చేసిన రాళ్లను తిరుమల మెటల్ ఇండస్ట్రీ వారు క్రష్ చేసిన ఆ మెటిరియల్ రాఘవ కనస్ట్రక్షన్ వారు తమ రోడ్డు పనుల కోసం కోనుగోలు చేయడం జరిగిందని గత కొన్ని సంవత్స రాల నుండి ఈ ప్రదేశంలో ఎటువంటి బ్లాసింగ్ జరగలేదని ఎటువంటి మైనింగ్ చేయలేదని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఈ ప్రాంతంలో ఒక్క కొత్త క్వారికి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. వట్టినాగులపల్లి, కోకాపేట అనేక ప్రాంతాల్లో ఇదే విధానంలో అనేక క్రషర్లు బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నుండి చుట్టు పక్కల సెల్లారు తొవ్వకాలలో వచ్చిన రాళ్లను వినియోగించుకుంటున్నారని ఆధారాలు లేకుండా మా కంపెనీ ఇమేజ్‌ను దెబ్బతీసేలా మాట్లాడితే న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**మంత్రిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి : కాంగ్రెస్**

మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలని పలువురు కాంగ్రెస్ నేతలు సూచించారు.శుక్రవారం శంషాబాద్ పరిధిలోని కోత్వాల్ గూడలో కాంగ్రెస్ నేతలు పర్యటించారు.అనంతరం బిఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలపై పలువురు కాంగ్రెస్ మాట్లాడారు...బిఆర్ఎస్ నాయకులు కావాలని రాజకీయ లబ్ధి కోసం హరీష్ రావు,కెటిఆర్ ఆదేశాల మేరకు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్,దాసోజ్ శ్రావణ్,కార్తీక్ రెడ్డిలు పర్యటించి అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాస్తవానికి ఇక్కడ ఏలాంటి బ్లాస్టింగ్ జరగడం లేదని వాపోయారు.కేవలం రాజకీయ లబ్ధి కోసం వారు పని కట్టుకొని గందరగోళాన్ని సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వాని బద్నాం చేయడానికి చేస్తున్న ప్రయత్నం తప్ప ఎలాంటి నిజాలు లేవని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని బిఆర్ఎస్ లాగా దోపడిలు చేయదని ఆరోపించారు. మంత్రులు,ప్రభుత్వంపైన అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## జ్యోతిష్యం శాస్త్రీయ ప్రమాణాలతో ఉండాలి

**నాంపల్లి, మార్చి 6 ప్రభాతవార్త :** ఖగోళ గ్రహాల గమ నాలపై నిశిత అధ్యయనం, ఖచ్చితమైన కాలనిర్ణయాలతో జ్యోతిషం శాస్త్రియ ప్రమాణాలతో ఉండాలని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచా ర్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్ర భుత్వం ప్రతిపాదించిన 100 రోజుల ప్రణాళికలో భాగం గా శుక్రవారం ఉదయం నాంపల్లి విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విశ్వ విద్యాలయం జ్యోతిష వాస్తుశాఖ, సామాజిక తదితర శాస్త్రాలపీఠం ఏర్పాటు చేసిన రసఝరి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిత్యానందరావు గ్రహాలు మాన వ జీవితాల్ని ప్రభావితం చేస్తాయేకానీ నియంత్రించవని, కొంతమంది జ్యోతిష్యులు సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తుల బలహీనతలను ఆసరా చేసుకుంటున్నారని, అది సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని హితవుపలి కారు.అనంతరం జ్యోతిష వాస్తుశాఖ అధ్యాపకులు డా. ఎ.ఎస్.ఫణీంద్ర శాంతి ప్రక్రియలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై విశ్లేషణాత్మక ప్రసంగం కావించారు. తదుపరి జ్యోతిషం మానవ జీవితాలపై ప్రభావం అనే శీ ర్షికతో ఒక్కొక్క గ్రహం, నక్షత్రం, రాశులపై విశ్వవిద్యా లయ ఎంఏ విద్యార్థులు కవిత పద్యగేయ రూపాలతో అద్భుతంగా ప్రదర్శించారు.

## మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**బంట్వారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని డీఎస్పీ బిక్షపతి అన్నారు. శుక్రవారం బంట్వారం మండలంలోని సల్బత్తాపూర్, బంటారం, తొర్మామిడి, రొంపల్లి గ్రామాలలో ఎస్సై విమల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, మాదకద్రవ్యాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా యువత ఈ మాదకద్రవ్యాల వలన తమ జీవితాలను బలి చేసుకుంటున్నారని మాదకద్రవ్యాలిచ్చే మత్తు మైకంలో తమలోని విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి మృగంలా ప్రవర్తిస్తూ అనేక దుశ్చర్యలకు పాల్పడుతూ జీవితాలను యువత నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎస్సై విమల మాట్లాడుతూ, ముఖ్యంగా పిల్లలను వీటి భారిన పడకుండా కాపాడుకోవాలని ప్రజలకు దానిపైన ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ ప్రజా సంక్షేమం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మాదక ద్రవ్యాలలో అతి ప్రమాదక రమైనవి గంజాయి వంటివి విక్రయాలు జరిపితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లలను వారి యొక్క అలవాట్లను గమ నిస్తూ ఎప్పటికప్పుడు వారిని పరిశీలిస్తూ సక్రమంగా పెంచాలని అన్నారు. సాధ్య మైనంతవరకు పెద్దలు కూడా మత్తు పానీయాలకు, సిగరెట్ బీడీలకు దూ రంగా ఉంటూ ఆరోగ్యాలను కాపా డుకుంటూ మంచి ప్రవర్తనతో జీవిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించ వచ్చు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ సరోజ, ఎస్ఐలు అనిత, శ్వేత, మోమిన్ పేట్ ఎక్సైజ్ ఎస్సై రేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పీ బిక్షపతి

## కార్యాచరణ ప్రణాళికకు సహకరించాలి

**శామీర్‌పేట, మార్చి 6, ప్రభాతవార్త :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలుకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి ప్రజాప్రతినిధులతో, అధికారులతో, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి శ్రీకారం చుట్టారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్‌లో పారిశుద్య కార్యక్రమంతో పాటు ప్రభుత్వం సూచించిన వాటిని అమలు చేయటానికి సహకరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కృషి చేయాలని చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం కమిషనర్, వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ 99రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్‌చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతిమాదవరెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు గాదె వెంకటేశ, కైర గణేశ్, గూదె వెంకటేశ, సరసం వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుదాకర్‌రెడ్డి, కోడూరి మౌనిక, ఎ.వెంకటేశ, ఎఇ సనాషాహిన్, ఇంచార్జి మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఓ వేణుగోపాల్, విజయకుమార్, నాయకులు కంఠం కృష్ణారెడ్డి, కోడూరి దినేశ్, తూమ్ శ్యామ్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ప్రగతి ప్రణాళిక పనులు

**శంకర్‌పల్లి, మార్చి 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం శంకర్ పల్లి మున్సిపాలిటీలో ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, సి.డి.ఎం.ఏ, తెలంగాణా డా. టి.కె.శ్రీదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. శంకర్ పల్లి మునిసిపాలిటిలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలనీ, రోడ్లపై చెత్త వేయరాదని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలనీ, ప్లాస్టిక్ వినియోగం నిషేదించాలని పారిశుద్ధం విషయంలో శంకర్ పల్లి పట్టణం జాతీయ స్థాయిలో అవార్డు పొందాలని ప్రజలకు సందేశం అందజేసారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కే. ఫల్గుణ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ శ్రీమతి జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, మున్సిపల్ డి ఈ యాదయ్య , మున్సిపల్ ఏఈ నరేష్, మెప్మా ఆర్పీలు, పారిశుద్ధ సిబ్బంది, తదితర మునిసిపల్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సాంకేతిక రంగాల్లో రాణించాలి

**ఘట్‌కేసర్, మార్చి 6, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా మహిళలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమని జపాన్ ఎల్ఎస్ ఫార్ట్నర్స్ సంస్థ సీఈఓ సయూరి మత్సునో అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జపాన్ ఎల్ఎస్ ఫార్ట్నర్స్ సంస్థ సీఈఓ సయూరి మత్సునో ముఖ్యఅతిథిగా విచ్చేసి మహిళల సాధికారత, నాయకత్వం, ప్రపంచ వ్యాప్తంగా మహిళలు సాధిస్తున్న విజయాలను విద్యార్థులకు వివరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన వి-హబ్ సంస్థ సోషల్ ఇంపాక్ట్-ఎంటర్ ప్రెన్యూర్షిప్ (ఎస్ఐఈ) ప్రోగ్రాం అసోసియేట్ డైరెక్టర్ ఉహాసజ్జా మాట్లాడుతూ యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, మహిళా వ్యాపాధిభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల స్ట్రాటజీ డైరెక్టర్ కొమ్మూరి దివ్య మాట్లాడుతూ మహిళఉ విద్య, సాంకేతిక రంగాల్లో ముందుకు రావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రోత్సహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈసందర్భంగా మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్తమ విద్యార్థినులు, అధ్యాపకులను సత్యరించారు. ఈకార్యక్రమంలో కేపీఆర్ఐటీ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనాథ్ కాశ్యప్, డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేట్ రిలేషన్స్ డీన్ అనీష్ శ్రీవాస్తవ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ చదివిన యువతిని

### వివాహం చేసుకున్న ముగ్గురు పిల్లల తండ్రి

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:**

పెళ్లై ముగ్గురు పిల్లలున్న ఒక హోంగార్డు ఒక యువతిని వివా హం చేసుకొన్న సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఒక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగా ర్డుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఇటీవల విధుల నిమిత్తం మేడారం వెళ్లాడు. అదే జాతరకు నగరం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటర్ పూర్తి చేసుకున్న ఒక యువతి(22) తన తల్లి కనిపించడం లేదని హోంగార్డు కూర్చొన్న ట్రాఫిక్ బూత్‌ను ఆశ్రయించింది.

ఇద్దరు కలిసి గంట వ్యవధిలోనే ఆ మె తల్లిని గుర్తించారు. ఇలా ఏర్పడిన పరిచయం వీరిద్దరి మ ధ్య ప్రేమకు దారితీసింది. నగరానికి వచ్చిన తరువాత ఇద్దరూ తరుచుగా కలుసుకునేవారు. కాగా హోంగార్డు భార్య తన ఇద్ద రు ఆడపిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లగా కుమారుడితో ఉ న్న అతను గత నెల 25న తను ప్రేమించిన యువతిని అమీ ర్‌పేటలోని ఒక దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. ఇటీ వల ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రులు గుర్తించారు. కా గా తమకు రక్షణ కల్పించాలంటూ హోంగార్డు, యువతి ఇద్ద రు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు.

వివాహం చేసుకొని విడాకులు తీసుకోకుండా మరో పెళ్లి ఎలా చేసుకుంటావంటూ పోలీసులు హోంగార్డును ప్రశ్నించగా తా ను కోర్టును ఆశ్రయించినట్లు తెలిపాడు. కాగా యువతి మేజర్ కావ డంతో పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంత రం వారిద్దరిని అక్కడి నుంచి వివరాలు సేకరించి పంపించారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట

**శామీర్‌పేట, మార్చి 6, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లిలో శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మూడుచింతలపల్లిలో శ్రీపెద్దమ్మ ఆలయంలో శ్రీఅమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల నుంచి శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా యజ్ఞహోమాలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగ శుక్రవారం శ్రీపెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పాల్గొని పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ ఛైర్మన్ జామ్ రవి, వైస్‌చైర్మన్ శశిరేఖ, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత ఆలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు బ్యాడ్మింటన్ పోటీలు

**నందిగామ, మార్చి 6, ప్రభాతవార్త:** నందిగామ మండలం కన్హ శాంతి వనంలో 7వ సీనియర్ పర జాతీయ బ్యాడ్మిం టన్ ఛాంపియన్ షిప్ 2026 పోటీలు నిర్వహిస్తున్నట్లు హార్ట్ ఫుల్ నెస్ గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు జరిగే క్రీడలలో సుమారు 700 మంది పర బ్యాట్మెంటన్ అథ్లెట్స్ పాల్గొంటున్నట్లు తెలిపారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుండి పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**కొడంగల్,మార్చి 6ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పరిశుభ్రత పాటిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ ఛైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.తెలంగాణా ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రజా పాలన ప్రగతి ప్రాణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమం కొడంగల్ మున్సిపాలిటీలో ప్రారంబించారు.అందులో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చైర్‌పర్సన్ నందారం ప్రశాంత్,వైస్ చైర్‌పర్సన్ శంకర్‌నాయక్,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ అన్ని వార్డుల కౌన్సిలర్లు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంబించారు.ఈ సందర్భంగా పట్టనాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు.అంతేగాక పట్టణంలోని 12వ వార్డులో చైర్మేన్ ప్రశాంత్,మున్సిపల్ కౌన్సిలర్ సుష్మదాము స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను చేపట్టారు.ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు, ఆర్పీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనలో ఆదర్శంగా నిలవాలి

**ధారూరు, మార్చి 6, ప్రభాతవార్త :** మండలంలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికఖి కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ఆదర్శప్రాయంగా పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి బి.నర్సింలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఈ కార్యక్రమం కింద రూపొందించిన 99 రోజుల కార్యాచరణపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మార్చి 6న ప్రారంభమైన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం 99 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేవలం పరిశుభ్రతకే పరిమితం కాకుండా ఆరోగ్యం, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సాజిద బేగం, ఎంపీవో షఫీ ఉల్లా ఖాన్, ఏపీవో రాములు, డాక్టర్ శాంతి,ఏఈలు, సూపర్వైజర్ శాంత బాయ్, ఏపిఎం మంజులవని, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్

**చేవెళ్ల, మార్చి 6, ప్రభాతవార్త:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం పర్యటించారు ఈ సందర్భంగా ఆయా అవార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజి సమస్య, రోడ్ల సమస్య ఎక్కువగా ఉందని వారి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విన్నవించారు. సందర్భంగా వారు సానుకూలంగా స్పందించారు. వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు శైలజాఆగిరెడ్డి, మంగలి కళ్యాణియాదగిరి, అధికారులు రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య పనులు ప్రారంభం

**ఘట్‌కేసర్, మార్చి 6, ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రత పాటించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణీరెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం '99 డేస్ యాక్షన్ ప్లాన్-ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీ కార్యాలయం ఆవరణలో పారిశుద్య సిబ్బంది చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. విరిగిపోయి నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్‌ను ట్రాక్టర్‌లో ఎత్తి తరలించారు. డీసీ వాణిరెడ్డి పారిశుద్య పనులను పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నగర పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు

## యూనిఫామ్స్ పంపిణీ

**యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త :**

బోరబండ సాయిబాబానగర్‌లోని అంగన్వాడీ ప్రీ స్కూల్‌లో చిన్నా రులకు ఐసీడీఎస్ మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పౌష్టిక ఆహారంతో పాటు యూనిఫామ్‌సు అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు రమేష్‌నాయక్, చైర్మన్ మధుసూ దన్, జాయింట్ సెక్రటరీ పరుశురామ్, నవీన్‌నాయక్, అంగన్‌వాడీ టీచర్ నీతు సురేఖ, వెంకటరత్నమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బండి రమేష్



కమిషనర్ శ్రీజనకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 6, ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజనను టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం హైటెక్స్‌లోని ఆమె కార్యాలయంలో కలిశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ వన్ హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 8న జరగనున్న భారీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెకు పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. స్థానిక సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, తూము వేణు, శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కృష్ణ రాజ్ పుత్, రంగమోహన్, మస్తాన్ రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదల ఆకాంక్షించే టివి.స్వామి చిన్నారి కథలు

**-శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్**



చిన్నారి కథలు ఆవిష్కరించిన కొలకలూరి ఇనాక్, ఓలేటి, విహారి, సుధామ, రఘురామ్, టి.వి.స్వామి తదితర అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 6 ప్రభాతవార్త :** పిల్లలను ఎట్లా పైకితేవాలో, ఏంచేస్తే గొప్పవారవుతారో అదంతా చేసి వారిని గొప్పవారిగా చూడాలన్న జీవనవిధానం, సాహిత్యతత్వమున్న రచయిత తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి) పిల్లలు అభివృద్ధిలోకి రావాలన్న ఆకాంక్ష తన చిన్నారి కథలు రచనలో ప్రస్ఫుటమవుతుందన్నారు. కవిగా, వచన రచయితగా, అన్నింటికీమించి విద్యార్థులకు పాఠంచెప్పే మాతృస్వభావముందన్నారు. అందన్నీ తనపిల్లలనుకుని వారికి జీవిత సారాంశం చెప్పాలన్న ఉబలాటం, ఆరాటంతో ఉండే వ్యక్తి వెంకటస్వామి అన్నారు. ఎప్పుడూ నీతిబోధే చేసేవారని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆత్మీయ అతిథులు విహారి, సుధామ, రఘుశ్రీ, పొత్తూరి సుబ్బారావు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, వ్యాసకర్త, కవి, ఉపన్యాసకర్త తిరుమల వెంకటస్వామి రచించిన చిన్నారి కథలు పుస్తకాన్ని ఆవిష్కరించి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డా. అయినాల మల్లేశ్వరరావుకు తొలిప్రతిని అందజేసి అంకితోత్సవం కావించారు.

## అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్స్ పంపిణీ



సాయిబాబానగర్‌లో అంగన్వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫామ్‌లను అందజేస్తున్న ఐసీడీఎస్ మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ అధికారులు.

**యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త :** బోరబండ సాయిబాబానగర్‌లోని అంగన్వాడీ ప్రీ స్కూల్‌లో చిన్నారులకు ఐసీడీఎస్ మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పౌష్టిక ఆహారంతో పాటు యూనిఫామ్‌సు అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు రమేష్‌నాయక్, చైర్మన్ మధుసూదన్, జాయింట్ సెక్రటరీ పరుశురామ్, నవీన్‌నాయక్, అంగన్‌వాడీ టీచర్ నీతు సురేఖ, వెంకటరత్నమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో పర్యటించిన ప్రధాని మోడీ సోదరుడు ప్రహ్లాద్ మోడీ



చాంద్రాయణగుట్ట సోనా భయ్యా నివాసంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో భారత ప్రధాని నరేంద్రమోది సోదరుడు ప్రహ్లాద్‌మోది

**చాంద్రాయణగుట్ట, మార్చి 6, ప్రభాతవార్త :** భారత ప్రధాన మంత్రి నరేంద్రమోది సోదరుడు, అఖిల భారత చౌక ధరల దుకాణం డీలర్ల సమాఖ్య ఉపాధ్యక్షులు ప్రహ్లాద్‌మోది శుక్రవారం పాతబస్తీలో పర్యటించారు. సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి జ్యోతిధర్ సింగ్ (సోనా భయ్యా), కుమార్తె సోనాల్‌మోది, అల్లుడు విరాగ్‌మోది, స్నేహితుడు హకుమ్‌సాహు, సుయాష్ రాథోడ్, విశాల్ సింగ్, ప్రదీప్ పాండే, ప్రవీణ్ సింగ్ తదితరులతో కలిసి చారిత్రక చార్మినార్ చెంతన గల శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మోదికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మోది, కుటుంబ సభ్యులను అమ్మవారి దుప్పట్టాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం చాంద్రాయణగుట్ట ఇందిరానగర్‌లోని శ్వేతగంగ దేవాలయాన్ని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆతరువాత కుమ్మరివాడీలో సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి సోనా భయ్యా నివాసంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. సోనా భయ్యా, కుటుంబ సభ్యులు ప్రహ్లాద్‌మోదిని ఘనంగా సన్మానించారు. ప్రహ్లాద్‌మోది ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. బస్తీవాసులు ఆయనతో ఫోటోలు, సెల్ఫీలు దిగారు.

## సిఎండిని కలిసిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ జెఎసి



సిఎండీ జితేష్‌పాటిల్‌తో కందుకూరి శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ఇటీవల నూతన సిఎండీగా బాధ్యతలను స్వీకరించిన టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ వి పాటిల్‌ను తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ జేఏసీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా ప్రత్యేకంగా సిఎండీతో సమావేశమై టర్న్‌కీ సిస్టంతో ఎదురవుతున్న సస్యలపై సమగ్రంగా వివరించారు. కాంట్రాక్టర్ల విన్నపాన్ని విన్న సిఎండీ టర్న్‌కీ సిస్టమ్ పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు జెఏసీ చైర్మన్ కందుకూరి శ్రీనివాస్ తెలిపారు.

## అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే తమ లక్ష్యం

**-బి ఏం ఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం**



బి ఏం ఎస్ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికైన సుంకరి మల్లేశం ను శుక్రవారం సత్కరిస్తున్న జి హెచ్ ఎం సి భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ

**చిక్కడపల్లి మార్చి 6 ప్రభాతవార్త :** భారతీయ మజ్దూర్ సంఘ్ కేవలం ఒక కార్మిక సంఘం మాత్రమే కాదు, అది కార్మికుల ఆత్మగౌరవ ప్రతీక అని సంఘ్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బి ఎం ఎస్ కేంద్ర కార్యాలయంలో ఇటీవల సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశంను జి హెచ్ ఎం సి భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ ఆధ్వర్యంలో సత్కరించే కార్యక్రమం జరిగింది. మల్లేశం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమైంది అని, రాబోయే రోజుల్లో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే మన లక్ష్యం కావాలన్నారు. ఈపీఎఫ్ఓ ద్వారా కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను మరింత సులభతరం చేసేందుకు కృషి చేయడంతో పాటు ప్రతి కార్మికుడికి న్యాయం జరిగే వరకు బీఎంఎస్ పోరాటం కొనసాగుతుంది" అని పేర్కొన్నారు. టి.కృష్ణ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి సుంకరి మల్లేష్ అందిస్తున్న సేవలు దేశవ్యాప్తంగా కార్మిక లోకానికి ఎంతో ప్రేరణగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆయన నాయకత్వంలో కార్మికుల సమస్యలు పరిష్కారమై, సంక్షేమం మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, సీనియర్ నాయకులు జయేందర్, బీఎంఈయూ జనరల్ సెక్రటరీ టి. కృష్ణ, వైస్ ప్రెసిడెంట్లు రాధాకృష్ణ, బిక్షపతి, అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రద్యుమన్, ట్రెజరర్ వెంకటేష్, నాయకులు రూపేష్, రసూల్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# వంద రోజులు..135 అభివృద్ధి పనులు

**- రూ. 40 కోట్ల పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు.

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వల్లాల నవీన్‌యాదవ్ బాధ్యతలు స్వీకరించి వంద రోజులు పూర్తైన సందర్భంగా నియోజకవర్గంలో రూ. 40 కోట్లతో 135 అభివృద్ధి పనులను శుక్రవారం శంకుస్థాపన చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నీవన్‌యాదవ్‌ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి అపూర్వమైన విజయాన్ని అందించారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ ఆయన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామిలన్నింటిని ఒకొక్కటిగా పూర్తి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని రానున్న మూడేళ్లలో అభివృద్ధికి చిరునామా మార్చి చూపిస్తానని చెప్పారు. గత నాయకులు, పాలకులు చేయలేని అభివృద్ధి పనులను చేసి చూపిస్తానన్నారు. 100 రోజుల్లో నిరంతం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీటి, డ్రైనేజీ, సీసీ దారులకు ప్రధాన్యతనిస్తూ పూర్తి చేస్తూ వస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ఎర్రగడ్డ, వెంగళ్‌రావునగర్, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, ఏజీకాలనీ, కృష్ణనగర్, రహమత్‌నగర్, కార్మికనగర్, రాజీవ్‌నగర్, బోరబండ, షేక్‌పేట డివిజన్‌లలో ఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వనం సంగీతశ్రీనివాస్‌యాదవ్, బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి, భవానీశంకర్, కాంగ్రెస్ నేతలు డివిజన్ల వారీగా పాల్గొన్నారు.

## జ్యోతిషం శాస్త్రీయ ప్రమాణాలతో ఉండాలి : ఆచార్య వెలుదండ నిత్యానందరావు



జ్యోతిష రసఝరి విద్యాత్మక ప్రసంగ కార్యక్రమంలో పాల్గొన్న నిత్యానందరావు, బివి.సత్యనారాయణ, పద్మప్రియ, విశ్వవిద్యాలయ విద్యార్థులు

**నాంపల్లి, మార్చి 6 ప్రభాతవార్త :** ఖగోళ గ్రహాల గమనాలపై నిశిత అధ్యయనం, ఖచ్చితమైన కాలనిర్ణయాలతో జ్యోతిషం శాస్త్రీయ ప్రమాణాలతో ఉండాలని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఉదయం నాంపల్లి విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విశ్వవిద్యాలయం జ్యోతిష వాస్తుశాఖ, సామాజిక తదితర శాస్త్రాలపీఠం ఏర్పాటు చేసిన రసఝరి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిత్యానందరావు గ్రహాలు మానవ జీవితాల్ని ప్రభావితం చేస్తాయేకానీ నియంత్రించవని, కొంతమంది జ్యోతిష్యులు సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తుల బలహీనతలను ఆసరా చేసుకుంటున్నారని, అది సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని హితవుపలికారు. అనంతరం జ్యోతిష వాస్తుశాఖ అధ్యాపకులు డా. ఎ.ఎస్.ఫణీంద్ర శాంతి ప్రక్రియలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై విశ్లేషణాత్మక ప్రసంగం కావించారు. తదుపరి జ్యోతిషం మానవ జీవితాలపై ప్రభావం అనే శీర్షికతో ఒక్కొక్క గ్రహం, నక్షత్రం, రాశులపై విశ్వవిద్యాలయ ఎంఏ విద్యార్థులు కవిత పద్యగేయ రూపాలతో అద్భుతంగా ప్రదర్శించారు. వేద జ్యోతిషంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనే విషయంపై ఎంఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి; ఖగోళశాస్త్రం-జ్యోతిష శాస్త్రాల తులనాత్మక అధ్యయనంపై ఎంఏ విద్యార్థిని; జ్యోతిషశాఖ విద్యార్థులచే దారిదీపం నాటిక; ఎంఏ మొదటి సంవత్సర విద్యార్థులచే పంచాంగం, జ్యోతిష ప్రాచీన గ్రంథాలు తులనాత్మక అధ్యయనం ప్రదర్శనలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

## వినూత్నంగా హైదరాబాద్ నగర పిల్లల పార్లమెంట్



వినూత్నంగా నిర్వహించిన హైదరాబాద్ నగర పిల్లల పార్లమెంట్

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో పిల్లల ఆరోగ్యం, భద్రత, పర్యావరణ, భవిష్యత్‌పై ప్రభావం చూపుతున్న ఆనేక సమస్యలపై వినూత్నంగా హైదరాబాద్ నగర పిల్లలు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోని పిల్లలు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ సిటి చిల్డ్రన్స్ పార్లమెంట్‌కు చెందిన 105 మంది సభ్యులు ముఖ్యంగా మురికివాడలు, ఇతర అట్టడుగు వర్గాల ప్రజలు నివసిస్తున్న పిల్లల తరుపున గత నెల 3న ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ 11-సస్టైనబుల్ సిటీస్ అండ్ కమ్యూనిటిస్‌పై హైదరాబాద్ పరిస్థితుల నేపధ్యంలో ఈ పార్లమెంట్ సమావేశంలో చర్చించడం జరిగింది. పిల్లల పార్లమెంటేరియన్లు తమ జీవితాలను ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన పట్టణ సమస్యలపై వారు చర్చించారు. వాటిలో ముఖ్యమైనవి వాయు కాలుష్యం, మూసి నది అభివృద్ధి ప్రాజెక్ట్, అందుబాటులో గృహాలు, డిజిటల్ భద్రత, సైబర్ సెక్యూరిటి, విపత్తుల సిద్ధత, మహిళలు, పిల్లల భద్రతపై ఈ పార్లమెంట్ సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ వినూత్న కార్యక్రమంలో స్పీకర్‌గా తాన్యా, ప్రధాన మంత్రిగా వి.అరుషి, హోం, వ్యవహారాల శాఖ మంత్రిగా ఐ.సిరిష్, పర్యావరణం, కాలుష్యనియంత్ర మంత్రిగా వవన్‌సాయి, సమాచార సాంకేతిక శాఖ మంత్రిగా వి.అస్మిత, గృహనిర్మాణం, మౌలిక వసతుల శాఖ మంత్రిగా ఖుష్బూరాయ్, లింగ సమానత్వ శాఖ మంత్రిగా మొహమ్మదిసనా, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఎల్.మాధవి పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మీ మందిరంలో ప్రహ్లాద మోడీ పూజలు



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన ప్రహ్లాద మోదీ

**చార్మినార్, మార్చి 6 ప్రభాతవార్త :** భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోదరుడు, అఖిల భారత సరసమైన ధరల దుకాణం డీలర్ల సమాఖ్య ఉపాధ్యక్షులు ప్రహ్లాద మోదీ శుక్రవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోదరుడు ప్రహ్లాద మోదీ కుటుంబ సభ్యులతో కలిసి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు. మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ప్రహ్లాద మోదీకి స్వాగతం పలికారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలి

**: ఉప కమిషనర్ రామేశ్వరరావు**



**జీడిమెట్ల, మార్చి 6, ప్రభాతవార్త** ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని గాజులరామారం ఉప కమిషనర్ రామేశ్వరరావు అన్నారు. శుక్రవారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి సర్కిల్ అధికారులకు, ఉద్యోగులకు తగు సూచనలు చేయడం జరిగింది. అదేవిధంగా ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారము కార్యక్రమాలు నిర్వహించి హెడ్ ఆఫీస్ వారు నిర్దేశించిన ఫార్మాట్లలో రిపోర్టులు సబ్మిట్ చేయాలని ఆదేశించారు. అలాగే గాజులరామారం సర్కిల్ పరిధిలో బాలయ్య బస్తి, వి ఎస్ ఆర్ సెలెస్టియల్ టవర్స్ ఏరియాలో ఫ్రైడే డ్రైడే లోభాగంగా దోమల నివారణ కొరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీపాధ రామేశ్వర్, అందరూ అధికారులు, సర్కిల్ అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు యు సి డి ఆర్ పి లు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 10న విశాఖలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

**సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** మహిళలపై హింసను పెంచుతున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న విశాఖపట్నంలో సభ నిర్వహిస్తున్నామని చైతన్య మహిళా సంఘం ప్రకటించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.జ్యోతి, ప్రతినిధులు వి.శ్రీదేవి, అలివేలు, సత్య, అరుణ, గిరిజ తదితరులు ఈ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బాలికలు, మహిళల విద్యకు ఎంతో కృషి చేసిన సావిత్రిబాయిపూలే వర్ధంతి రోజు మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం స్పూర్తితో ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ప్రముఖులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పల్లవి, శ్రీదేవి, శిరీష, లలిత, శ్రావణి, రాధ, డా.నిర్మలారాణి, లక్ష్మి, విమల, సత్యవతి, శ్యామల తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

## ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్ళాల్సింది అధికారులే

**- జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ**



నర్కి పూల్‌బాగ్‌లోని చార్మినార్ జోనల్ కార్యాలయం ఆవరణ పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డి

**చాంద్రాయణగుట్ట, మార్చి 6, ప్రభాతవార్త :** జీహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ పరిధిలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అన్ని సర్కిళ్లలో ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్ళాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక తొలి రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో పలు విభాగాల నిర్వాహణను, పరిసరాలలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. అపరిష్కృత సమస్యల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను నేటి (శుక్రవారం) నుంచి జూన్ 12వ తేదీ వరకు మూడు నెలల పాటు ఐదు దశలలో, 10 థీమ్‌లతో నిర్వహించనున్నట్లు వివరించారు. పౌరసేవలకు, ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజా సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణ, కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత, క్రీడా మైదానాలు, పార్కులు, ప్రధాన రోడ్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, పబ్లిక్ టాయిలెట్స్ తదితరాలను ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. మొదటి రోజు జోన్ పరిధిలోని సంతోష్‌నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, ముసారాంబాగ్ సర్కిళ్లలోని 18 కార్యాలయాలను పరిశుభ్రం చేసినట్లు వెల్లడించారు. సుమారు 6.20 టన్నుల చెత్తను తొలగించడం జరిగిందన్నారు. సర్కిళ్ల వారీగా ప్రతి విభాగంలోని అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నివేదికలు రూపొందిస్తామన్నారు. జోనల్ వెంట యాకుత్‌పురా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ దేవజా, పలు విభాగాల అధికారులు, జోనల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

## హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలి : మహిళా కాంగ్రెస్ డిమాండ్



మంత్రి హర్దీప్ సింగ్ పూరి దిష్టి బొమ్మను దగ్ధం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి , మార్చి 6 ( ప్రభాతవార్త ) :** కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అశోక్ నగర్ చౌరస్తాలో సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవిత ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు హర్దీప్ సింగ్ పూరి మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నాల కవిత, రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీతారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్నాల కవిత మాట్లాడుతూ.. ఇటీవల వెలుగులోకి వచ్చిన జెఫ్రీ ఎప్స్టీన్ వ్యవహారంలో హర్దీప్ సింగ్ పూరికి సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. చిన్నారులను, అమ్మాయిలను వేధించే ఇటువంటి అరాచక శక్తులతో సంబంధం ఉన్న వ్యక్తి కేంద్ర మంత్రిగా కొనసాగడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం, సదరు మంత్రిని సమర్థించడం విచారకరమని ఆమె విమర్శించారు. అమ్మాయిలను ఎంపిక చేసి ఎప్స్టీన్ దీవులకు పంపడం, వారిని లైంగిక వేధింపులకు గురిచేయడం వంటి దారుణాల వెనుక ఉన్న వారి అసలు రంగు బయటపడిందని ధ్వజమెత్తారు. మహిళలకు, చిన్నారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని, వెంటనే కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులను అత్యుత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత పాఠశాలదే : ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్



రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న వివేకానందగౌడ్, రమణాచారి, అశ్విని సుబ్బారావు, హనుమంతరావు, నరేష్ తదితర అతిథులు

**నాంపల్లి, మార్చి 6 ప్రభాతవార్త :** విద్యార్థులను అత్యుత్తమ విద్యావంతులుగా, ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత పాఠశాలలు, ఉపాధ్యాయులదేనని, ఎమ్మెల్యే సభ్యుడు కె.వి.వివేకానందగౌడ్ అన్నారు. శివా విద్యానికేతన్ యాజమాన్యం శ్రీగాయిత్రి స్కూల్ పేరిట నూతన విద్యాలయాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన కె.పి.వి వేకానందగౌడ్ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, వివేకానంద సేవాసమితి ఛైర్మన్ సిహెచ్.హనుమంతరావు, అశ్వినీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సిహెచ్.వి.(అశ్వినీ)సుబ్బారావు, గౌరవ అతిథులు గాయత్రి కళాశాలల డీన్ నరేష్, జానకీరాములు, రాజశేఖరరెడ్డి, సాధన నరసింహాచార్య, కల్లాన్, డి.నాగరాజు, బిజెపి కౌన్సిల్ సభ్యులు షణ్ముఖ శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులతో కలిసి రిబ్బన్‌కట్ చేసి విద్యాసంస్థను ప్రారంభించి నాణ్యతమైన విద్యాబోధనతో విద్యార్థులు రాష్ట్ర, దేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా శిక్షణివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు, ప్రముఖ విద్యావేత్త లక్ష్మిసుభాషిణి, కార్యదర్శి నరేంద్రకృష్ణ, ఉపకార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటేనే...ఆరోగ్యం

**-జోనల్ కమిషనర్ మంద మకరందు**




**అత్తాపూర్ మార్చి 6, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో 99వ రోజు ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మొదటి రోజు శుక్రవారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మకరందు పాల్గొని రాజేంద్రనగర్ సర్కిల్ కమిషనర్ సురేందర్ రెడ్డి, అత్తాపూర్ డిసి సమ్మయ్యలతో కలిసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, నిర్దేశించిన డస్ట్‌బిన్‌లలోనే వేయాలని పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం కూడా బాగుంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు కాలనీలు, రోడ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ప్రజా పాలనా కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు చెప్పారు. స్థానిక ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం అక్కడికి వచ్చిన సిబ్బందితో కలిసి అధికారులు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ కమీషనర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నతధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

### మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘన సన్మానం

**పేట్ బషీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త** 286 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో మహిళా దినో త్సవాన్ని పురస్కరిం చుకొని శుక్రవారం మస్కూరి పద్మ, విజ యదేవి, కవిత, కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళలకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను శాలు వాలతో సత్కరించి అడ్వాన్స్‌గా మహిళా దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని వారు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కుంట పద్మ సిద్ధిరా ములు, సమ్మయ్య, నేత చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ చదివిన యువతిని వివాహం చేసుకున్న ముగ్గురు పిల్లల తండ్రి

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:** పెళ్లై ముగ్గురు పిల్లలున్న ఒక హోంగార్డు ఒక యువతిని వివాహం చేసుకొన్న సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఒక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఇటీవల విధుల నిమిత్తం మేడారం వెళ్లాడు. అదే జాతరకు నగరం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటర్ పూర్తి చేసుకున్న ఒక యువతి(22) తన తల్లి కనిపించడం లేదని హోంగార్డు కూర్చొన్న ట్రాఫిక్ బూత్‌ను ఆశ్రయించింది. ఇద్దరు కలిసి గంట వ్యవధిలోనే ఆమె తల్లిని గుర్తించారు. ఇలా ఏర్పడిన పరిచయం వీరిద్దరి మధ్య ప్రేమకు దారితీసింది. నగరానికి వచ్చిన తరువాత ఇద్దరూ తరచుగా కలుసుకునేవారు. కాగా హోంగార్డు భార్య తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లగా కుమారుడితో ఉన్న అతను గత నెల 25న తను ప్రేమించిన యువతిని అమీర్‌పేటలోని ఒక దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రులు గుర్తించారు. కాగా తమకు రక్షణ కల్పించాలంటూ హోంగార్డు, యువతి ఇద్దరు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. వివాహం చేసుకొని విడాకులు తీసుకోకుండా మరో పెళ్లి ఎలా చేసుకుంటావంటూ పోలీసులు హోంగార్డును ప్రశ్నించగా తాను కోర్టును ఆశ్రయించినట్లు తెలిపాడు. కాగా యువతి మేజర్ కావడంతో పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిద్దరిని అక్కడి నుంచి వివరాలు సేకరించి పంపించారు.

### మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

**చాంద్రాయణగుట్ట, మార్చి 6, ప్రభాతవార్త :** మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక వ్యక్తికి కోర్టు మూడేళ్ళ కఠిన కారాగారశిక్ష, రూ.ఐదువేల జరిమాన విధించారు. షాహినాయత్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ కేసు వివరాలు... బహదూర్‌పురా, కోకబజార్‌కు చెందిన వ్యాపారి మహ్మద్ అయూబ్ ఎలియాస్ అవైస్ (34) 2023లో పదేళ్ళ మైనర్ బాలికను బలవంతంగా ఒకమైదానంలోని మూత్రశాలకు తీసుకువెళ్ళి తన మొబైల్‌ఫోన్‌ను పట్టుకోమని చెప్పాడు. అనంతరం ఆ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆబాలిక ప్రతిఘటించి గట్టిగా కేకలు వేసింది. నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. సమీపంలోని మహిళలు ఆ బాలికను రక్షించి తండ్రికి అప్పగించారు. జరిగిన విషయాన్ని ఆ బాలిక తండ్రికి వివరించింది. అతడు షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా బాధిత బాలికను భరోసా కేంద్రానికి తరలించి 180 బిఎన్‌ఎస్‌ఎస్ స్టేట్‌మెంట్ నమోదు చేశారు. గోషామహల్ ఎస్ఐ లక్ష్మయ్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్‌రెడ్డి, భరోసా లీగల్ కౌన్సిలర్లు టి.కల్పన, ఎ.ఆర్.హిమ మీనన్, కోర్టు లైజనింగ్ అధికారులు వై.ఆంజనేయులు, సుశీల్ సింగ్‌ల సమిష్టి కృషితో కోర్టు ముందు చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. నాంపల్లి 12వ అదనపు సెషన్స్ జడ్జి కేసును విచారించి నిందితుడు మహ్మద్ అయుబ్‌కు మూడేళ్ళ జైలుశిక్ష, రూ.ఐదువేల జరిమానా విధించారు. కేసును మహిళా భద్రతా విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య, ఏసీపీ ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మేరీ అగస్టీన్లు సమన్వయం చేశారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సంబంధిత అధికారులను నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ అభినందించారు.

## సినీ అవకాశాల పేరుతో అసభ్య చేష్టలు

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**

**జూబ్లీహిల్స్, మార్చి 6, ప్రభాతవార్త:** సినీ అవకాశాల కోసం వచ్చిన ఒక యువతిని అవకాశం పేరుతో అసభ్యకర దృశ్యాలను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్న ఒక వెబ్ సిరీస్ దర్శకుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణనగర్‌లో నివసించే శంకర్(25) రీల్స్‌తోపాటు వెబ్‌సిరీస్‌లకు దర్శకత్వం వహిస్తాడు. సినీ అవకాశాల కోసం కాకినాడ నుంచి వచ్చిన ఒక యువతి(23)కి వెబ్‌సిరీస్‌లో అవకాశం కల్పించాడు. కారులో కొన్ని అభ్యంతరకమైన దృశ్యాలను చిత్రీకరించి వాటిని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఇది గమనించిన యువతి తల్లిదండ్రులు ఆమెపై కోపగించుకోవడంతో ఆయా వీడియోలను తొలగించాలంటూ యువతి శంకర్‌ను కోరింది. వీడియోలు తీయకపోగా ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రగ్స్‌మహమ్మారిని తరిమికొట్టండి

**కోట్‌పల్లి, మార్చి 6, ప్రభాతవార్త;** గ్రామాలల్లో యువత ముందుకు వచ్చి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని వికారాబాద్ యాంటి డ్రగ్స్ డిఎస్పీ బుచ్చయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంతోపాటు ఎన్నారం, మోత్కుపల్లి, బార్వాద్ గ్రామాలల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి గ్రామాలల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు అలావాటు పడి జీవితాలను నాశనం చేసుకోద్దని హితవు పలికారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నా.. విక్రయిస్తున్నా 1908కి సమాచారం ఇవ్వాలని కోరారు. వారికి తగిన ప్రోత్సాహకం కూడా ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో మత్తు పదార్ధాల వినియోగం ఆందోళనకర స్థాయికి చేరిందన్నారు. వాటి ప్రభావంతో యువతలో నేర ప్రవృత్తి పెరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ హేమంత్, మండల విద్యాధికారి చంద్రప్ప, స్థానిక ఎస్సై శైలజ, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారి మేఘన, మండల వ్యవసాయధికారి కరుణాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బైండ్ల



మోత్కుపల్లిలో అవగానా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమృతమ్మ నారాయణ, ఉప సర్పంచ్ మాదవరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మైపాల్‌రెడ్డి, ప్రభాకర్, ఎఎన్‌యం నర్సమ్మ, రవిందర్‌రెడ్డి, కారోబార్ అశోక్, ఆశావర్కర్లు రత్నమ్మ, వినోధ, అంగాన్‌వాడీ టీచార్ అనిత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**మర్పల్లి మార్చి 6 ప్రభాతవార్త :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాని నార్కోటిక్ డియస్పీ సోమనాథ్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా శుక్రవారము మర్పల్లి, భూచన్‌పల్లి, కల్కోడ, పలు గ్రామాలలో డ్రగ్స్‌పై



మర్పల్లిలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్వహించిన అవగాహన సదస్సులలో ఆయన మాట్లాడారు. నేడు కొందరు యువకులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలను నిషేధించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చెయ్యాలని కోరారు. యస్.ఐ అబ్దుల్ రహూఫ్, యు.రవిందర్, మర్పల్లి సర్పంచ్ రామేశ్వర్, తహాశిల్దార్ పురుషోత్తం, కార్యదర్శి లక్ష్మీకాంత్ పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు. భూచన్‌పల్లి, కల్కోడాలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యు.రవిందర్, కల్కోడ, సర్పంచ్, మాజీ సర్పంచ్ రాచన్న పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్లు పంపిణి చేస్తున్న కెకె కృష్ణ

## మంచి ఫలితాలు సాధించండి

**జిల్లెడు చౌదరిగూడ, కొందుర్గు, మార్చి 6,ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలను ఏకాగ్రతతో మంచిగా వ్రాసి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు కావాలని సామాజికవేత్త కేకే కృష్ణ విద్యార్థులను కోరారు. శుక్రవారం కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు పంపణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చౌడపురం ప్రభాకర్ అమర్నాథ్ రెడ్డి, కనకమామిడి అంజయ్య, నర్సింలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు జహంగీర్, మల్లేష్ గౌడ్, సత్య నారాయణ రెడ్డి, అక్రమ్, జంగయ్య, నరేందర్‌తోపాటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ అనురాధ

## ప్రగతి ప్రణాళికకు సిద్ధం కండి

**జిల్లెడుచౌదరిగూడ/కొందుర్గు, మార్చి 6, ప్రభాత వార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి అధికారులు ప్రజా ప్రతినిధులు సిద్ధం కావాలని ఎంపీడీవోలు లక్ష్మి అనూ రాధ, ప్రవీణ్‌కుమార్‌లు కోరారు. శుక్రవారం కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడ మండలాలలో ఏర్పాటు చేసిన అవగా హన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా 99 రోజులు గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ విజయ్ కుమార్ పాల్, ఏపీవో నర్సింగరావు, సీనియర్ సహాయకులు గణపతి తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలతో యువతకు భవిష్యత్తు

**షాద్‌నగర్, మార్చి 6, ప్రభాతవార్త :** లింగారెడ్డి గూడాలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కోసం రూ.29.70 కోట్ల నిధులు మంజూరు అవడం పట్ల ఆ గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కళాశాల గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తెస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. గ్రామ అభివృద్ధిలో ఇది ఒక్క గొప్ప ముందడుగు అని ప్రశంసించారు. అతి ముఖ్యమైన ఈ విద్యా సంస్థను తమ గ్రామానికి మంజూరు చేయడానికి కృషిచేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కళాశాల స్థాపనతో ఈ ప్రాంతంలోని యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తు బంగారు మాయమవుతుందని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు తమ గ్రామాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు.





ఆందోళన చేస్తున్న మీటర్ రీడింగ్ ఉద్యోగులు

## 30 రోజులపాటూ పని కల్పించాలి

**ఆమనగల్లు, మార్చి 6, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న మీటర్ రీడింగ్ సేకరించే కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈసందర్భంగా ఆమనగల్లు విద్యుత్ కార్యాలయ పరిధిలో కార్మికులు పాకటి కుమార్, జంతుక కిరణ్, చెక్కల సాయికుమార్, తోట నరేష్, ఆమనగంటి సురేష్, వసుప్పుల వంశీ, జటావత్ తులసిరామ్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొని మాట్లాడారు. తమ ఉపాధి కొన్ని రోజులకే పరిమితం కావడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. మిగతా కార్మికుల మాదిరిగానే మీటర్ రీడింగ్ కార్మికులకు 30 రోజుల పని దినాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ వెంకటయ్య

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ఆమనగల్లు, మార్చి 6, ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను త్వరితగతిన పరిష్కారించేందుకు కృషి చేస్తానని 14వ వార్డు కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య తెలిపారు. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. శుక్రవారం వెంకటయ్య వార్డులోని దళితకాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈమేరకు దళితకాలనీలో ఎదురవుతున్న వీధిలైట్లు, అండర్‌డ్రైనేజీ ఆవశ్యకత తోపాటు పలు వీధులలో ధ్వంసమైన సీసీరోడ్ల నిర్మాణాల గురించి వివరించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడూ మున్సిపాలిటీ దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. 14వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శంకర్ తదితరులు ఉన్నారు.

## దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా

**చేవెళ్ల, మార్చి 6, ప్రభాతవార్త:** వాడు పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని కౌన్సిలర్ అతెల్లి మనిషా అనంతరెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ ఏఈ సాహితి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, వీధి దీపాలు తదితర సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా



వార్డులో పర్యటిస్తున్న కౌన్సిలర్

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

**ఈగల్ ఫోర్స్ ఎస్‌పి రఘువీర్**

**పూడూరు, మార్చి 6, ప్రభాతవార్త :** ప్రతిఒక్కరు డ్రగ్స్ రహిత సమాజంకోసం కృషిచేయాలని ఈగల్‌ఫోర్స్ ఎస్‌పి రఘువీర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసి పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేలా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వాడకంవల్ల యువత ఆరోగ్యం పాడవ్వడంతోపాటు దేశాభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. సమాజంలో డ్రగ్స్ వాడకం నేరమని, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని, సదరు వ్యక్తుల



డ్రగ్స్ నిర్మలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వివరాలను ఎవరైనా అంతర్గతంగా సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను ఎంపిక చేసుకొని లక్ష్య సాధన కోసం కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దరక్షణ్ తమ్మన్న, దయాకర్, సిఐ రవీందర్, తహశీల్దారు విజయకుమార్, ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఓ పాండు, మండల విద్యాధికారి సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, విద్యార్థు తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చటమే ప్రభుత్వ లక్ష్యం

**శామీర్‌పేట, మార్చి 6, ప్రభాతవార్త :** పేదల సొంతింటి కలను నెరవేర్చటం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పేదల కలను తీరుస్తుందని ఆ లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.నర్సింలుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావటంతో ఆయన ప్రారంభించి లబ్దిదారులను గృహప్రవేశం చేయించారు. దీనిలో ఆయనతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, స్థానిక కౌన్సిలర్ బి.మల్లేశ్‌యాదవ్,పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎఎంసి ఛైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల కోసం స్వంతింటి కలను నిజం చేయటానికి ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణంకు 5లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంను సకాలంలో పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసిన లబ్దిదారులను వారు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు స్థానిక కౌన్సిలర్ బి.మల్లేశ్‌యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రామస్వామి, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్, స్థానిక నాయకులు ఈశ్వర్, ఏ.కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశం చేయించిన ఎఎంసి ఛైర్మన్ తదితరులు

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**పెద్దేముల్, మార్చి 6, ప్రభాతవార్త:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కందనెల్లి, మంబాపూర్, పెద్దేముల్, గాజీపూర్ గ్రామాలలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని తెలిపారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలించెందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం వల్ల మనిషి వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని చెప్పారు. మత్తు పదార్థాలు ఎక్కడైన కనిపించిన, ఎవరైన మత్తు పదార్థాలకు సంబందించిన కార్యాకలాపాలు చేపడితే నార్కోటిక్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా 8712671111 అనే నెంబర్‌కు వివరాలను వాట్సప్ చేయాలని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్‌పోర్స్ ఇన్స్‌పెక్టర్ దిలిప్ కుమార్, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ రతన్‌సింగ్, ఎక్సైజ్ అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సొంత నిధులతో హైస్కూల్ నిర్మాణం

**నందిగామ, మార్చి 6, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో నిర్మిస్తున్న హైస్కూల్ రెండవ అంతస్తు స్లాబ్ పనులకు సర్పంచ్ కొమ్ము కృష్ణ, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, షాద్నగర్ ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి హాజరై ఎమ్మెల్యే సేవలను కొనియాడారు. తాను చదువుకున్న పాఠశాలలో ఎమ్మెల్యే శంకర్ సొంత నిధులతో హై స్కూల్ నిర్మాణం చేపట్టడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి,మల్లి వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగళ్ళ సురేష్ , చించేటి శివకుమార్ గౌడ్, బొమ్మగల్ల నర్సింలు, నరసింహులు సుమలత,నాయకులు కుందారం వెంకట్ రెడ్డి, బి జంగయ్య గౌడ్, శివగళ్ల సతీష్ (సత్తిపండు), ఎర్రగారి రమేష్, తడకల జంగయ్య, నరేందర్ రెడ్డి, రామచంద్రి, ఏపూరి ఆనందం, తదితరులు ఉన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రం

**కుల్కచర్ల, మార్చి 6 ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రమవుతుందని యాంటి నారోకటిక్స్ ఎసిపి రమేష్ కుమార్, కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు. శుకవ్రారం మండల కేంద్రంతో పాటు, ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, గ్రామాలలో మాదక ద్రవ్యాలపై అవగాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమాజంలో గౌరవ మర్యాదలు కలిగి ఉండేలా విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అవలర్చుకోవాలన్నారు. డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ పెద్ద సంఖ్యలో కేసులు నామోదు చేస్తున్నామన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అయా శాఖల అధికారులు అయా గ్రామాల సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులు, గురువులకు పాదపూజ

**మాడ్గుల, మార్చి 6, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సంస్కారం, విలువలను పెంపొందించేందుకు సెంటిమేరి పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య రమేష్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి వికాస సాధన - యోగ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులకు పాదపూజ చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల పాదాలకు పూజలు చేసి కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆచార్య రమేష్ గురూజీ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు ఎంతో ముఖ్యమని అన్నారు. వారి మార్గదర్శకత్వంతోనే విద్యార్థులు మంచి భవిష్యత్తు నిర్మించుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం యోగ సాధన, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమన్యం బిజ్జుజోసఫ్, బీనా, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు మాడ్గుల శంకర్, వేణు, ఉమపతి, తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయితో సామాజిక గౌరవం కూడా దెబ్బతింటుంది

**దుద్యాల్, మార్చి 6,ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కుదురుమల్ల, హకీంపేట్ గ్రామాల్లో ఈగల్ ఫోర్స్ ఏసీపీ శంకర్ యాదవ్, ఎస్సై శ్రీశైలం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఈగల్ ఫోర్స్ ఏసీపీ శంకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి వంటి అలవాట్ల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు సామాజిక గౌరవం కూడా దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా లేదా వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దుద్యాల్ ఎస్సై శ్రీశైలం మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, యువత పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు కూడా నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ యాదవ్

## యాచారంలో మహిళా సంఘాలకు శిక్షణ

**యాచారం, మార్చి 6, ప్రభాతవార్త :** యాచారం మండల మహిళ సంఖ్య భవనంలో గ్రామ సంఘల పాలక వర్గానికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో కమిటీల గురించి, శాసనత్మక బాధ్యతల గురించి సంస్థాగత నిర్మాణం గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా నవీన్ కుమార్ ఐబి డైరెక్టర్ సర్ప్ తెలంగాణ, కరుణాకర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సర్ప్, యాదయ్య డి పి ఎం ఐబి డిఆర్డిఏ రంగారెడ్డి జిల్లా, సర్ప్ సిఆర్పిలు మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమలత అందరూ గ్రామ సంఘం అధ్యక్షులు సీసీలు గణేష్ రాజు జయ పద్మశ్రీ జయలక్ష్మి జ జయ శంతుల సునీత శేఖర్ అకౌంటెంట్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

## మత్తు రహిత సమాజమే లక్ష్యం

**ధారూరు, మార్చి 6, ప్రభాతవార్త :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ సి.ఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధారూర్ మండల పరిధిలోని ధారూర్, నాగసమందర్, కెరెల్లి, నాగారం గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో పిల్లల భద్రత,డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ధారూర్ సి.ఐ రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజలకు, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి సమాజంలో డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలని, గ్రామీణ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం(1908)కు అందించాలని కోరారు. ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ఈ ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామ గ్రామాన చైతన్యం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింలు మాట్లాడుతూ మండల అభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న ఈ 99 రోజుల ప్రణాళికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ శాంతి ఆరోగ్య పరంగా మత్తు పదార్థాలు కలిగించే నష్టాలను వివరించగా, ఎంపీఓ షఫీ ఉల్లా ఖాన్, ఎస్.ఐ సున్నం రాఘవేందర్ శాంతిభద్రతల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో ధారూర్ సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్, నాగసమందర్ వెంకట్, నాగారం సర్పంచ్ నిరటి లక్ష్మీ శ్రీనివాస్, కెరెల్లి సర్పంచ్, మాజీ జడ్పీటీసీ రాములు, బాబా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**కేశంపేట మార్చి 6 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ రెండవ సంవత్సరం మాథ్స్, జువాలాజీ, హిస్టరీ, వొకేషనల్ ఎగ్జామ్స్ ప్రశాంతంగా ముగిశాయని ఎగ్జామ్స్ చీఫ్ సూపరిండెంట్ శ్రీకాంత్ తెలిపారు. 70 మంది విద్యార్థుల్ని కాలేజీకి కేటాయించగా 69 మంది విద్యార్థులు హాజరైనారు. ఒకరు గైర్హాజరు అయ్యారని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే ఎగ్జామ్స్ సెంటర్ కు చేరుకోవాలని, ఎలాంటి వత్తిడికి లోనవ్వకుండా ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. ఇన్విజిలేటర్స్ వివిధ అధికార సిబ్బంది సహాయంతో 7వ రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.





ఎంఈఒకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

## ఫీజులు నియంత్రించకపోతే ఉద్యమిస్తాం

**షాద్‌నగర్, మార్చి 6, ప్రభాతవార్త :** రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చకుండా, నిబంధనను అతిక్రమించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, పాఠశాల ప్రాంగణాల్లోనే బుక్స్, యూనిఫార్మ్ విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా వేధిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం వీటి అమ్మకాలను నిషేధించినా, ఫరూఖ్‌నగర్ మండలంలో తనిఖీలు లేకపోవడం వల్లే యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫార్మ్ విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని, అనుమతి లేకుండా అడ్డగోలుగా పెంచిన ఫీజులను నియంత్రించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలని, ఫీజుల నియంత్రణపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి మాట్లాడుతున్న అల్లి దేవేందర్

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**మొయినాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** మొయినాబాద్ మున్సిపల్ కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు విధులు బహిష్కరించి,తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ మొయినాబాద్ పురపాలక సంఘంలో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని మొయినాబాద్ పురపాలక సంఘానికి మంచి పేరు రావడం కోసం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ అనారోగ్యాల పాలైన కార్మికులు పనిచేస్తున్నారని కానీ మున్సిపల్ అధికారులు వారి సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని అన్నారు. కార్మికులకు ప్రతినెల 5వ తారీఖు లోపు వేతనాలు చెల్లించాలని మొయినాబాద్ మున్సిపల్ అధికారుల నిరక్ష్యంగా కార్మికులు రెండు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు . వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు సబ్బులు, నూనెలు, ఈఎస్ఐ కార్డు, పిఎఫ్ నంబర్, షూస్, గ్లోజులు,నూతన యూనిఫామ్స్ ఇవ్వాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళనలో తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు రత్నం అధ్యక్షులు సుధాకర్ ప్రధాన కార్యదర్శి సురేష్ కోశాధికారి కృష్ణ ఉపాధ్యక్షులు కృష్ణ జగన్ నరసింహ శ్రీకాంత్ రాజు చెన్నయ్య నరసింహ వాటర్ మేన్స్, ఎలక్ట్రిషన్లు,పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరెంట్ సరఫరా బంద్

**మేడ్చల్, మార్చి 6. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి విద్యుత్ సబ స్టేషన్ పరిధిలో నేడు కరంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దూళపల్లి ఫీడర్‌లోని దూళపల్లి రోడ్, గుండ్లపోచంపలి గ్రామం, స్కైలార్ బిల్డర్స్, రైల్వే గేట్ రోడ్, డీఆర్ఎస్ స్కూల్ ప్రాంతాలతో పాటు నైబర్‌వుడ్ ఫీడర్ పరిధిలోని ఊర్జిత, ట్రిడెంట్ ప్రాపర్టీస్, ప్రెస్టేజ్ గ్రీన్, లక్ష్మీ నగర్, ఎస్ఎల్ఆర్ కాలనీ, మాణిక్‌రెడ్డి నగర్, ఏజీ సైట్ కాలనీ ఏరియాలో నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కరంట్ ఉండదని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



మంత్రి శ్రీధర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిరీష

## అలియాబాద్ అభివృద్ధికి సహకరించాలి

**శామీర్‌పేట, మార్చి 6, ప్రభాతవార్త :** మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ (ఉమ్మడి జిల్లాల) ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా అలియాబాద్ మున్సిపల్ నూతన ఛైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి కలిసి సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. అదే విధంగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ప్రభుత్వ ఛీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డిలను కూడ కలిసి ఆమె సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. అలియాబాద్ అభివృద్ధికి సహకరించాలని ఆమె వారిని కోరారు. శుక్రవారం ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మేడ్చల్ ఎఎంసి ఛైర్మన్ బి.నర్సింలుయాదవ్ కూడ అధికారిక కార్యక్రమంలో పాల్గొని ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబును సన్మానించి కలిసి ఆశీస్సులు అందుకున్నారు. దీనిలో వారితో పాటు జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడిడ, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొనటం జరిగిందన్నారు.



అన్నదానం చేస్తున్న ధర్మ ప్రచార సభ ప్రతినిధులు

## అనాధ ఆశ్రమంలో అన్నదానం

**శామీర్‌పేట, మార్చి 6, ప్రభాతవార్త:** జగ్గంగూడలోని అనాధ ఆశ్రమంలో అనాధలకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ వారు సేవా కార్యక్రమంలో భాగంగ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిదిలోని జగ్గంగూడలో ఉన్న హోమ్ ఫర్ డిజబుల్ అనాధ ఆశ్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దుర్గాప్రతి మధు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ పిఆర్ఓ రాయబారపు రవి రాజు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని, అయ్యప్ప భక్తులు అందరు ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.